క్లుప్తంగా

మద్దిలో ప్రసాదాల తయారీకి ఏప్రిల్ 5న టెండర్లు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారి క్షేత్రంలో లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీకి ఏప్రిల్ 4వ తేదీన నిర్వహించనున్న సీల్డ్ టెండర్ కం ఈ టెండర్ దాఖల ప్రక్రియను ఏప్రిల్ 5వ తేదీకి మార్చినట్లు దేవస్థానం ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు టెండర్లు దాఖలు చేసుకోవాలని, 11.30 నుంచి 12.30 గంటల సమయంలో టెండర్లు తెరవడం జరుగుతుందని ఈవో తెలిపారు.

శ్రీవారికి వెండి కిరీటం



కిరీటాన్ని అందజేస్తున్న కిరణ్‌కుమార్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేట గ్రామానికి చెందిన పారేపల్లి కిరణ్‌కుమార్ బుధవారం 490 గ్రాముల వెండి కిరీటాన్ని బహూకరించాడు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి అనంతరం ఈ వెండి కిరీటాన్ని ఆలయ కార్యాలయంలో దేవస్థానం ఏఈఓ మెట్టపల్లి దుర్గారావుకు అందజేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత కర్పూరం కృష్ణ

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని విజయ దుర్గమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు తమ వంతు సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తున్నారని ఆలయ కమిటీ అధ్యక్షులు మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఈ మేరకు జంగారెడ్డిగూడెంకు చెందిన వ్యాపారవేత్త కర్పూరం కృష్ణ రూ. 25,116 పేరంపేటరోడ్‌లోని ఆయన వ్యాపార కేంద్రం వద్ద ఆలయ కమిటీకి అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఓఎఫ్‌ఆర్ సమస్యలు పరిష్కరించాలి

బుట్టాయగూడెం : అటవీ హక్కుల చట్టంలో లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పి.అరుణ్‌బాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐటీడీఏ కార్యాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓఎఫ్‌ఆర్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆర్‌ఓఎఫ్‌ఆర్‌లో దరఖాస్తులను ఏప్రిల్ 3, 4, 5 తేదీల్లోపు క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ ఝూన్సీరాణి, తహసీల్దార్‌లు ఎస్.శారాశాంతి, కె.చెల్లన్నదొర, కృష్ణజ్యోతి, సుబ్బారావు, ఎలీషా, సుమతి, ప్రమజ్వాలా తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని మార్కెట్ యార్డులో వారపు పశువుల సంత, తరువాత రోజు మార్కెట్ యార్డు శుభ్రపరుచు నిమిత్తం పేడ పోగు చేసుకుని తీసుకువెళ్లందుకు గాను 2023–24 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 31వ తేదీ ఉదయం 11 గంటలకు చింతలపూడి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డు వద్ద వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు పాట సమయానికి గంట ముందుగా రూ.2,500 ధరావతు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

ఆ జీవో నుంచి మినహాయింపు ఇవ్వాలి

శ్రీవారి దేవస్థానం క్షురకుల విజ్ఞప్తి

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పనిచేసే క్షురకులకు నెలకు రూ. 20 వేలు వేతనం ఇచ్చేలా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని శ్రీవారి దేవస్థానం క్షురకులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు బుధవారం పోస్టు ద్వారా పంపారు. జీఓ ఎంఎస్ నంబర్ 110 ప్రకారం ప్రతి నెలా తమకు రూ. 20 వేలు వేతనం ఇస్తారని, అయితే ప్రస్తుతం తమకు అంతకంటే ఎక్కువ వేతనమే వస్తోందని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ జీవో వల్ల తమకు వేతనం తగ్గే ప్రమాదం ఉందన్నారు. పెద్ద దేవాలయాల్లో పనిచేసే క్షురకులకు దీంతో లాభం కంటే నష్టమే ఎక్కువ ఉంటుందన్నారు. కాబట్టి ఈ జీవో నుంచి తమకు మినహాయింపునిచ్చి, ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలని క్షురకులు బొండాడ సాత్యకిరావు, ఎ.వీ్రరాజు, బి.కోటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు తదితరులు కోరుతున్నారు.

అక్కచెల్లెమ్మలకు అండగా జగనన్న

- ద్వారకాతిరుమలలో 'ఆసరా' సంబరాలు
- మహిళలకు చెక్కు అందజేసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



మహిళలతో కలసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: మహిళల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 1,524 స్వయం స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.16.09 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే తలారి అందజేశారు. ఆ తరువాత లబ్ధిదారులతో కలిసి సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న తన ప్రజాసంకల్ప యాత్రలో పొదుపు మహిళలకు 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న రుణాలన్నీ మాఫీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మూడో విడత సైతం ఆసరా పథకాన్ని అమలు చేశారన్నారు. అమ్మ ఒడి, ఆసరా, సున్నావడ్డీ, వసతి దీవెన, విద్యా దీవెన, విద్యాకానుక తదితర పథకాలు మహిళలకు, వారి బిడ్డలకు చేయూతనిస్తున్నాయని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కేవలం జన్మభూమి కమిటీ సిఫార్సు చేసిన వారికే అందేవన్నారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అన్ని పదవుల్లోను మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా లబ్ధి పొందిన మహిళలు ఎంతో మంది చిరువ్యాపారాలు పెట్టుకుని స్వయం ఉపాధి సాధిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే మళ్లీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహిని, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, బొండాడ వెంకన్నబాబు, గోపాలపురం నియోజకవర్గ పార్టీ మహిళా అధ్యక్షురాలు గారపాటి రమాదేవి, మండల అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, దాకారపు బంగారమ్మ, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మానుకొండ సుబ్బారావు, కుంటం స్వర్ణలత, ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, రుద్ర శివాజీ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ భాషా, మెడికల్ చిన్ని, పోలకంపల్లి అనీల్‌బాబు, చెలికాని బుల్లియ్య, సొసైటీ చైర్‌పర్సన్‌లు గోపా నాగేశ్వరరావు, చెరుకూరి ప్రసాదరావు, భోగరాజు చిన్ని, గుర్రాల లక్ష్మణ్, యాచమనేని నాగేశ్వరరావు, బసివిరెడ్డి వెంకట్రామయ్య, ఎంపీడీవో ఏవీ సుబ్బరాయన్, ఏపీఎం ఎం.అరవిందమ్మ తదితరులున్నారు.

అక్షయ పాత్రగా అంగన్‌వాడీ కేంద్రాలు



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : ప్రభుత్వం కల్పిస్తున్న వసతులతో అంగన్‌వాడీ కేంద్రాలు మహిళలకు, చిన్నారులకు అక్షయపాత్రగా మారాయని మాజీ సర్పంచ్, ఎంపీటీసీ తేనే శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగపతిదేవిపేట గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలలో సామూహిక సీమంతం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ యుఎన్ పీవో స్వర్ణకుమారి ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ అబ్బూ త్రిమూర్తులు హాజరై సీమంత కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సమృద్ధిగా అందచేస్తుండడంతో శిశువులు ఆరోగ్యవంతులుగా తయారవుతున్నారని అన్నారు. కోమటికుంట ధనలక్ష్మి, కట్ట భవాని, కోమటికుంట శాలిని తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికే అధిక ప్రాధాన్యత



జంగారెడ్డిగూడెం మండలంలో వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో జంగారెడ్డిగూడెం మండలంలోని డ్వాక్రా మహిళలకు 3వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో అక్కచెల్లెమ్మల బాధలు తెలుసుకుని, వారు సామాజిక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గమనించారన్నారు. అధికారంలోకి వచ్చిన నాటినుంచి మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి పథకం కూడా మహిళల పేరునే అందిస్తున్నామన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా మాట తప్పకుండా, అక్కచెల్లెమ్మలను ఆదుకున్న ఏకైక వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. 2019లో చంద్రబాబు నాయుడు మాటలను నమ్మకుండా మహిళలు బుద్ధి చెప్పారని, ఇప్పుడు మళ్లీ రానున్న ఎన్నికల్లో కూడా మోసం చేసేందుకు చంద్రబాబు వస్తున్నాడని, ఈసారి చీపురు కట్టలతో తరిమి కొట్టేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు నవరత్న పథకాలను ఆపగలరా లేదా కొనసాగిస్తామని ధైర్యంగా చెప్పగలరా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. దుష్ట చతుష్టయం చేస్తున్న దుష్ప్రచారాలను మహిళలు తిప్పి కొట్టాలన్నారు. జగనన్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తొలుత కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ చైర్‌పర్సన్, ఏలూరు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, మండల కమిటీ అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, గురజాల పార్థసారధి, సర్పంచ్, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొన్నారు.

శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు

మంత్రి జోగి రమేష్



మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు ఆహ్వానం పలుకుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : శరవేగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు రూపుదిద్దుకుంటున్నాయని మంత్రి జోగి రమేష్ తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాతో కలిసి ఆయన హాజరయ్యారు. నూతనంగా ఏర్పాటు చేసిన రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఏప్రిల్ 20వ తేదీ నాటికి సుమారుగా 5లక్షల ఇళ్లు గృహప్రవేశాలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పూర్తి స్థాయిలో కాలనీల్లో విద్యుత్, మంచినీరు, డ్రెయిన్, పక్కా రోడ్ల నిర్మాణాలు జరిగిన తరువాత అక్కచెల్లెమ్మలచే గృహ ప్రవేశాలు జరిపించాలని సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 20 నాటికి ఆయా కాలనీల్లో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో బ్రహ్మాండమైన మెజార్టీతో సీఎంగా వైఎస్ జగన్ పీఠం ఎక్కుతారని మంత్రి జోగి రమేష్ స్పష్టం చేశారు. లోకేష్ పాదయాత్ర అంతా ఒక కామెడి సబ్జెక్ట్ మాత్రమే అని, కాసేపు నవ్వుకోవడానికి పనికి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవల్లి సోంబాబు, కొయ్యలగూడెం వైస్ ఎంపీపీ మట్టా వనజలక్ష్మి, ఉమెన్ వెల్ఫేర్ రీజనల్ కో–ఆర్డినేటర్ వి.సాయి బాల పద్మ, మండల పట్టణ కన్వీనర్లు వామిశెట్టి హరిబాబు, పీపీఎన్ చంద్రరావు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నవమి వేడుకలకు రామాలయాలు ముస్తాబు



బుట్టాయగూడెం రామాలయంలో దర్శనమిస్తున్న సీతారామలక్ష్మణ ఆంజనేయుల విగ్రహాలు

బుట్టాయగూడెం : శ్రీ సీతారామచంద్ర స్వామి నవమి వేడుకలకు గిరిజన ప్రాంతంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. ఈ వేడుకలను వైభవంగా జరిపించేందుకు అన్ని గ్రామాల్లోనూ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది రోజుకో వేడుక చొప్పున 9 రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. బుట్టాయగూడెంలో సుమారు 60 సంవత్సరాల క్రితం నిర్మించిన రామాలయంలో, ఏజెన్సీలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో, దుద్దుకూరులో వేడుకలను ఘనంగా నిర్వహించే విధంగా అన్ని ఏర్పాట్లు చేశారు.

నేడు రాములోరి కళ్యాణం

కొయ్యలగూడెం : శ్రీరామనవమి వేడుకలకు రామాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. గురువారం నవమి వేడుకలను నిర్వహించడానికి వాడవాడలా ప్రతి పల్లెలోని రామాలయాలను కమిటీలు సిద్ధం చేశాయి. కొయ్యలగూడెంలో ప్రధానంగా నాలుగు రామాలయాలతో పాటు ప్రత్యేకంగా నవమి వేడుకలను నిర్వహించడానికి మందిరాలను ఏర్పాటు చేశారు. కన్నాపురం, బోడిగూడెం గ్రామాలలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న రామాలయాలలో నవమి వేడుకలు నిర్వహించనున్నారు. తూర్పు పేట రామాలయం నవ వేడుకలకు పెట్టింది పేరు. ఈ నేపథ్యంలో రాములోరి కల్యాణ నిర్వహణకు చలువ పందిళ్లను నిర్మించారు. గవరవరం రోడ్డులోని మహేంద్ర నగర్ బాలగణపతి ఆలయంలో, వైష్ణవ క్షేత్రాలతో పాటు శైవక్షేత్రాలలో నవమి వేడుకలు నిర్వహించనున్నారు.

నవమి శుభాకాంక్షలు తెలిపిన బాలరాజు

బుట్టాయగూడెం : పోలవరం నియోజకవర్గంలోని ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతు సీతారాముల దీవెనతో ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని ఆయన అభిలాషించారు. ప్రతి ఇంటా శ్రీరామనవమి పర్వదినాన్ని, రాముల వారి కల్యాణాన్ని వేడుకగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

అసెంబ్లీ తీర్మానాన్ని రద్దు చేయాలని ధర్నా

బుట్టాయగూడెం : బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్పేవిధంగా రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బొంతు, ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల గిరిజనులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సవలం రాంబాబు, దాడి రాముడు, మిడియం రవి దొర, తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రిక ఆవిష్కరణ

బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని కోరుతూ ఈ నెల 31వ తేదీన మన్యం బంద్ పిలుపు నేపథ్యంలో బుధవారం గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గోడపత్రిక, కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక బస్టాండ్ వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, కె.దుర్గారావు, లక్ష్మణరావు, న్యూడెమోక్రసీ నాయకులు తగరం బాబూరావు, కొండరెడ్ల సంఘం నాయకులు పట్లా రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : హోప్ మినిస్ట్రీస్ సంస్థ ద్వారా పేద, మధ్య తరగతి మహిళల అభివృద్ధికి, కుటుంబ పోషణకు ఆదాయాన్ని సమకూర్చుకునేలా కుట్టు మెషీన్లు పంపిణీ చేయడం అభినందనీయమని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. బుధవారం స్థానిక చిట్టూరి గణేశ్వరరావు టౌన్ హాల్ వద్ద మెగా కుట్టు మెషీన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఎలీజా చేతులమీదుగా 100మంది మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ జాషువా మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మూడు కుట్టు మెషీన్ల శిక్షణా కేంద్రాలు తమ సంస్థ ద్వారా నిరంతరం నడుస్తున్నాయని, ప్రతి మూడు నెలలకు ఒకసారి శిక్షణ పొందిన మహిళలకు కుట్టు మెషీన్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ఎలిజాను జాషువా గెడ్డం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారథి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ రీజనల్ చైర్‌పర్సన్ వందనపు సాయిబాలపద్మ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, పార్టీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పట్టణ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, బత్తిన చిన్నా, కౌన్సిలర్‌లు నంబూరి రామచంద్రరాజు, కాసర తులసిరెడ్డి, ఉగ్గం ప్రసాద్, టీపీపీ మురళి, శ్రీనివాసపురం ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, లారీ

జంగారెడ్డిగూడెం : ఓ ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. రాజమండ్రి నుంచి జంగారెడ్డిగూడెం వస్తున్న ఆర్టీసీ బస్సు హైదరాబాదు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న లారీ జంగారెడ్డిగూడెం బైనేరు వంతెనపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు. బస్సు లారీ వంతెనపై అడ్డుగా ఉండటంతో ట్రాఫిక్ స్థంభించింది. ఎస్సై ఎం.సాగర్‌బాబు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

యువకుడికి గాయాలు

జంగారెడ్డిగూడెం : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలయ్యాయి. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన జయవరపు మహేష్ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం పనిలోకి వెళ్లి మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై ఇంటికి వెళుతున్న సమయంలో రావూరి జంక్షన్ వద్ద వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు అతడిని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గిరిజనుల ధర్నా



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : గిరిజనులు సాగు చేస్తున్న భూములను పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సేకరించవద్దని కోరుతూ మండలంలోని కేఆర్ పురం ఐటీడీఏ వద్ద ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల బాబ్జీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సేకరించే భూముల్లో అధికంగా ఎల్‌టీఆర్ కేసులు ఉన్నాయని అన్నారు. గిరిజనులకు 1933 ప్రకారం రికార్డులో నమోదై ఉన్న భూములను గిరిజనేతరులు దొడ్డిదారుల్లో పట్టాలు సృష్టించుకుని అన్యాక్రాంతంగా ఆక్రమించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు సాగులో ఉన్న భూములను పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సేకరించవద్దని డిమాండ్ చేశారు. అనంతరం ఒక వినతిపత్రాన్ని ఎస్‌డీసీ కార్యాలయంలో అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జంగారెడ్డిగూడెం : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జంగారెడ్డిగూడెం మండల ఎండీయు ఆపరేటర్లు బుధవారం డిప్యూటీ తహసీల్దార్ కె.వరలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తమ వ్యక్తిగత ఖాతాల నుంచి ఇన్సూరెన్స్ నిమిత్తం కట్ చేసిన నగదును తమ ఖాతాలలో తిరిగి జమ చేయించాలని, ప్రతి నెలా జీతం రూ.21 వేలు తమ ఖాతాలలో పడేలా చేయాలని కోరారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఏప్రిల్ నుంచి తాము విధులకు హాజరుకాబోమని వినతి పత్రంలో పేర్కొన్నారు.

ప్రకటన

వల్లే హరి కిషోర్ S/O నారాయణరావుకు చెందిన కొయ్యలగూడెం మండలం, పరింపూడిలో ఆర్.యస్.నెం.225/2 లో చ॥గ॥ 193.6 ఖాళీ స్థలమునకు చెందిన లింక్ దస్తావేజు నెం.470/2006 గల దస్తావేజులు పోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు.

9553123487

మురళి సేవలు ఎనలేనివి



మురళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కామవరపుకోట : మానవత సంస్థ మాజీ అధ్యక్షులు సాధనాల మురళి సేవలు ఎనలేనివని ఆయన మృతి సంస్థకు తీరని లోటు అని మానవత సంస్థ చైర్మన్ మిడత రమేష్ బాబు అన్నారు. బుధవారం నిర్వహించిన సంతాప సభలో మురళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ సాయన కనకరాజు, అధ్యక్షులు పొన్నుబోయిన సురేష్, షేక్ ఇబ్రహీం, టీవీ ఎస్ రాజు, మున్నంగి శ్రీనివాస్, వీరమల్ల మధు, నిజపరపు దుర్గాప్రసాద్, బద్రి, వెంకన్న, సత్తిబాబు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



కొయ్యలగూడెంలో విద్యార్థినుల సందడి

కొయ్యలగూడెం : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. ప్రథమ సంవత్సరం పరీక్షలు మంగళవారం ముగియగా ద్వితీయ సంవత్సరం పరీక్షలు బుధవారంతో పూర్తయ్యాయి. ఒకేషనల్ గ్రూప్స్‌కు సంబంధించిన విద్యార్థులకు 30, 31వ తేదీలలో పరీక్షలు నిర్వహించనున్నారు. కొయ్యలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రమే ఒకేషనల్ గ్రూప్స్‌కి చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉంది. ఇంటర్ పరీక్షలు ముగిసిన అనంతరం విద్యార్థులు ఆనందోత్సాహాలతో పరీక్షా కేంద్రాల నుంచి కేరింతలతో బయటకు వచ్చి సహచర విద్యార్థుల నుంచి వీడ్కోలు తీసుకున్నారు.

ప్రభుత్వ తీర్మానంపై పాస్టర్ల హర్షం

ద్వారకాతిరుమల : దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షణీయమని మండల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బిషప్ పాటిట శామ్యూల్ అన్నారు. మండలంలోని కోడిగూడెంలో స్థానిక పాస్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో బుధవారం మండల పాస్టర్ల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ తీర్మానంపై పాస్టర్లు వసంతరావు, అనిల్‌కుమార్, యాకోబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీల సమావేశం

జంగారెడ్డిగూడెం : మాదిగ రిజర్వేషణ పోరాట సమితి, మహాజన సోషలిస్ట్ పార్టీ అనుబంధ సంఘాల పోలవరం, చింతలపూడి నియోజకవర్గం నాయకుల కార్యకర్తల సమీక్షా సమావేశం బుధవారం జంగారెడ్డిగూడెంలో జరిగింది. మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కో–ఇన్‌చార్జ్ విస్సంపల్లి సిద్దు మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పీ కోస్తాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జ్ ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ పాల్గొని మాట్లాడారు. ఉద్యమంలోకి నవతరాన్ని తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి సంఘాలను పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

చింతలపూడి : బీజేపీ ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌వీ సత్యన్నారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు చేపట్టిన ప్రచార యాత్ర రథం బుధవారం చింతలపూడి చేరుకుంది. నిరసన కార్యక్రమానికి ప్రజలు నైతిక మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.